నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

మొక్కజొన్న క్షేత్రం సందర్శన


దిగుబడి సాధించిన రైతుకు సన్మానం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని చిన్నపోతంగల్ గ్రామంలో మల్లన్న సీడ్స్ వారి రైతు క్షేత్రా ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు పట్లోళ్ల బల్వంత్‌రావు మల్లన్న విత్తన రకము 19ఎం91 మొక్కజొన్న రాకము వాడి బల్వంత్ అనే రైతు అధిక దిగుబడి సాధించారు. దీంతో సంస్థ ప్రతినిధులు గోపాల్, సురేందర్ బల్వంత్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గోపాల్, సురేందర్, గాంధారి సొసైటీ డైరెక్టర్లు గోవింద్, గణపతిరావు, ఆర్ల శివాజీరావు, పోతంగల్ ఖుర్ద్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ అకిటీ గంగారెడ్డి, మహేష్ సెట్, అంజాగౌడ్, జవహర్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

13న మద్నూర్ సింగిల్ విండో 54వ మహాజనసభ

- కార్యనిర్వాహణ అధికారి జే బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం 54వ మహాజనసభను ఈనెల 13న బుధవారం ఉదయం 10:30 గంటలకు సంఘం భవనంలో పరపతి సంఘం చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణ అధికారి జే బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాజనసభలో 1-10-2023 నుంచి 1-3-2024 వరకు జమ, ఖర్చులు ఆమోదించుట, అలాగే 2024-2025 అంచనా బడ్జెట్ ఆమోదించుట ఇతర అంశములు అధ్యక్షుల వారి అనుమతితో చర్చించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి తెలిపారు. మహాజన సభ విజయవంతం చేయడానికి సంఘం కార్యవర్గ సభ్యులతో పాటు సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఎన్నికల ఎలక్ట్రోల్ బాండ్లను వెంటనే విడుదల చేయాలి

- ఎస్‌బీఐ చైర్మెన్‌ను బర్తరఫ్ చేయాలి
- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్


కంఠేశ్వర్ : ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ ఎదుట నాయకుల ధర్నా


బోధన్‌లో వినతి..

ఎస్‌బీఐ ఎన్నికల ఎలక్ట్రోల్ బాండ్లను వెంటనే విడుదల చేయాలని, అలాగే ఎస్‌బీఐ చైర్మెన్‌ను బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ ముందు ధర్నా నిర్వహించి మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ఎన్నికల బాండ్ల పేరుతో రాజ్యాంగ విరుద్ధంగా నిధులను సేకరించటాన్ని సుప్రీంకోర్టు తప్పుపడుతూ మార్చ్ ఆరో తేదీలోపు ఎన్నికల ఎలక్ట్రోల్ బాండ్ల వివరాలను వెంటనే ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించినప్పటికీ.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యం గడువు ముగిసేటప్పుడు మరొక 116 రోజులు సమయం ఇవ్వాలని అడిగిందని తెలిపారు. ప్రధానంగా బీజెపి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి బ్యాంకులో జరిగే అన్ని లావాదేవీలు ఆన్లైన్ విధానంలోనే కొనసాగుతున్నప్పటికీ ఎన్నికలు ముగిసే వరకు సమయాన్ని కోరట మంటే బీజెపి ఒత్తిడికి తలొగ్గి వారికి సహాయం చేయడమే అవు తుందని ఆయన విమర్శించారు. అందువలన స్టేట్ బ్యాంక్ ఆఫ్ చైర్మన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని, ఎన్నికల ఎలెక్టోరల్ బాండ్లను వెంటనే విడుదల చేయాలని, వాటిని ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజెపి పెద్దలకు సహాయం చేయటంతో వారి ద్వారా ఆర్థిక లబ్ధిని పొంది ఎన్నికల్లో ఎన్నికైన ప్రభుత్వాలను లొంగదీసుకోవటానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, పి.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు పెద్ది సూరి, సుజాత, కటారి రాములు, నల్వాల నరసయ్య, మున్నాభాయ్, పద్మ మారుతి తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : ఎస్‌బీఐ బ్యాంక్ ఎన్నికల బాండ్ల వివరాలను దేశ ప్రజల ముందు ప్రవేశపెట్టాలని కోరుతూ సోమవారం బోధన్ ఎస్బిఐ బ్యాంకు ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2017 నుండి 2023 వరకు ఎన్నికల బాండ్ల పేరుతో సుమారు రూ.16000 కోట్లు ఎస్బిఐ ద్వారా సేకరించిందని అన్నారు. ఇందులో కనీసం 70శాతం బాండ్లను ఒక బీజేపీ పార్టీకే వచ్చాయని అన్నారు. అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేటర్లకు రాయితీలను ఇచ్చి వారి నుంచి ఎన్నికల బాండ్లను పొందారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రజల ఆస్తులు అయిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పి వారి ద్వారా ఎన్నికల బాండ్లలో పెట్టుబడి పెట్టించారని అన్నారు. జాతీయ ఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఈ ఎన్నికల బాండ్లను రద్దు చేసిందని ఇది రాజ్యాంగ విరుద్ధమని తీర్పు వెల్లడించిందన్నారు. అంతేకాకుండా ఎన్నికల బాండ్ల వివరాలను దేశ ప్రజానీకానికి మార్చి ఆరో తారీకు వరకు తెలపాలని కోరినప్పటికీ ఎస్బిఐ మాత్రం జూన్ 30 వరకు అవకాశం ఇవ్వాలని కోరడం సుప్రీంకోర్టు ధిక్కారమవుతుందని అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందే వివరాలను ప్రజల ఎదుట వెల్లడించాలని కాని కావాలనే కేంద్ర ప్రభుత్వానికి తలవంచి ఇలా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. భారతదేశంలో ఆధునిక టెక్నాలజీతో పనిచేస్తున్న ఎస్బీఐ పది నిమిషాల్లో వివరాలన్నీ ప్రజల ముందు ఉంచే అవకాశం ఆలస్యం చేరడంలో ఉన్న ఆంతర్యమేమిటని నిలదీశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఏరియా కార్యదర్శి గంగాధర్, బోధన్ పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కుమారస్వామి, దాసి గోపి, గోవింద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులను ఆదుకుంటాం

- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నసురుల్లాబాద్


పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆయకట్టు కింద ఉన్న లక్షా 20 వేల ఎకరాల సాగుభూమికి 7 విడతలుగా సాగునీరు అందించి ఆయకట్టు రైతులను ఆదుకుంటామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో నీరందక పంటలు ఎండుతున్న వైనంపై నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలోని నల్లచెరువు కింద ఎండిపోయిన పంటలను పరిశీలించారు. సోమవారం బీర్కూర్ మండలంలోని నల్లచెరువు ఆయకట్టు కింద ఎండిపోయిన వరి పంట భూములను ఆయన పరిశీలించారు. తూముల్లో చెత్తాచెదారం తొలగించాలని అధికారులను ఆదేశించారు. బీర్కూరు మండల కేంద్రం నల్లచెరువు ప్రధాన తూము ఆయకట్టు కింద 600 ఎకరాల సాగు భూమి ఉందని ఈ తూము సక్రమంగా పని చేయకపోవడం వల్ల వందల ఎకరాల వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉందని పంటలకు సాగునీరు అందించాలని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. చెరువును పరిశీలించారు. పోచారం స్పందిస్తూ తూముల్లో పూడికను వెంటనే తీసివేయాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆయకట్టు కింద ఉన్న మండలాల్లో వరి పంట సాగుకై ప్రభుత్వం ఏడు విడుతలుగా సాగునీరు విడుదలపై అనుమతించిందని ప్రస్తుతం ఆరో విడత సాగునీరు విడుదల సాగుతుందని అన్నారు. విడుదలవుతున్న సాగునీటిని రైతులు వృథాగా పోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే మరో 22 తేదీ వరకు ఆరో విడత సాగునీరు కొనసాగుతుందని అనంతరం మరో వారం రోజుల్లోనే ఏడో విడత సాగునీరు విడుదలవుతుందని చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందకుండా సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్చి నెల చివరి వరకు ఆయకట్టుకు నీరు అందించాలని ఆదేశించారు. వీరి వెంట బీర్కూర్ ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సభ్యుడు సందీప్, ఆయకట్టు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోతి బిందు గుర్తింపు శిబిరం

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో మోతిబిందు గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యులు డాక్టర్ సతీష్ రోగులను పరీక్షించి మోతిబిందు ఉన్నవారికి ఉచిత ఆపరేషన్‌ల కోసం లయన్స్ క్లబ్ ఆసుపత్రికి సిఫారసు చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇంచార్జ్ హనుమంతరావు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శిల్ప ఉన్నారు.

వ్యవసాయ మహిళల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి

- మహిళా రైతుల జిల్లా సదస్సులో వక్తలు


మహిళా రైతులకు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

వ్యవసాయ మహిళల సమస్యల పరిష్కరానికి ఐక్యంగా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం నిజామాబాద్ పట్టణంలోని మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వ్యవసాయ మహిళా రైతు జిల్లా సదస్సును నేరడి గంగామణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పూల దండలు వేసి సన్మానించారు. మహిళలపై పూలు చల్లి ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.సుజాత మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర బాగా పెరిగిందని చెప్పారు. యాంత్రీకరణ రావడం వలన పురుషులు వ్యవసాయ రంగం నుంచి తప్పుకుని వలసలు వెళ్తుండడంతో, వ్యవసాయం బాధ్యత పూర్తిగా మహిళలపైనే భారం పడిందని వివరించారు. వ్యవసాయ కార్మిక మహిళలు కూడా వీరికి తోడుగా ఉంటున్నారని తెలిపారు. కానీ వీరు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. మహిళలు వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. యాంత్రీకరణ జరిగినప్పటికీ మహిళల పాత్ర ఏమాత్రం తగ్గలేదన్నారు. కుటుంబ శ్రమతో పాటు, వ్యవసాయరంగంలో నిరంతరం శ్రమ కొనసాగిస్తున్నారని, కానీ వీరికి భూములపై ఎలాంటి హక్కులు కల్పించలేదన్నారు. మహిళల పేరున పట్టాపాస్ బుక్కులివ్వాలని, పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ప్రభుత్వ పథకాలలో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ప్రతి ఐదుగురి మహిళలకు ఒక గ్రూపు ఏర్పాటు చేసి వారికి ఐదెకరాల భూమిని ఇప్పించి ప్రభుత్వ సహకారంతో ఉత్పత్తి చేయాలన్నారు. ఆ విధంగా మహిళల ఆదాయాన్ని పెంచడానికి గల అవకాశాలను ప్రభుత్వం చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప, జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకటాములు, జిల్లా నాయకులు భూమన్న, సుశీల, విజయలక్ష్మి, నాగమణి, నిలహీరమని, నస్రీన్, లక్ష్మి సాయమ్మ, భూదేవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ప్రగతిశీల మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.గోదావరి, నాగమణి, సిర్ప మంజుల, బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్, మహిళా సంఘం జిల్లా నాయకులు నర్సక్క, బీపాషా బేగం, ఐఎఫ్‌టియు జిల్లా నాయకురాలు రెహానా బేగం, భీమయ్య రుక్మా కవిత, సావిత్రి, పోసాని, గంగామణి, లక్ష్మి మహిళలు పాల్గొన్నారు.


మహిళ దినోత్సవంలో పాల్గొన్న పలువురు

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్
- కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముందు సోమవారం ధర్నా నిర్వహించి ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల బకాయి పడిన వేతనాలు ఏడు, ఎనిమిది నెలల వరకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 51 జీవో సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీల విధానాన్ని కొనసాగించాలని, కారోబార్, బిల్‌కలెక్టర్ల ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం పంచాయతీ ఉద్యోగులకు వేతనాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదులక్షల ఇన్సూరెన్స్ అమలుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేయాలని కోరారు.

కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలనర్సు, శ్యాంకుమార్, స్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హైవే రోడ్ల అభివృద్ధికి ఆరువేల కోట్ల నిధులు

- ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటీల్

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్


గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీ

జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో హైవే రోడ్ల అభివృద్ధి కోసం ఆరువేల కోట్ల నిధులు మంజూరు చేయించానని పార్లమెంట్ సభ్యుడు, జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి బీబీ పాటీల్ అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన సబ్కా సాత్ సబ్కా వికాస్ పథకం ద్వారా దేశ ప్రజల అభివృద్ధిని చూసి తాను బిజెపి పార్టీలో చేరినట్టు వివరించారు. సోమవారం తన సొంత గ్రామమైన సిర్పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. నరేంద్రమోడీ నాయకత్వంలో దేశ అభివృద్ధి కొనసాగుతుందని, భారతదేశాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పే విధంగా ఆయన చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు దేశ ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోడీ కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన సొంత గ్రామానికి మొట్టమొదటిసారిగా రావడంతో పొతంగల్ మండలంలోని చాలామంది బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు.

ధరణి సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి

- రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలి
- భూ తగాదాలకు ఎక్కడ తావు ఇవ్వొద్దు
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

ధరణి సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని, భూ తగాదాలకు ఎక్కడ తావు ఇవ్వొద్దని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో ఆర్డీఓతో పాటు, అన్ని మండలాల తహసీల్దార్‌లతో ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి భూ తగాదాలకు తావుఇవ్వొద్దని, ధరణి సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

వీరన్నగుట్టలో ఘనంగా వీరభద్రుడి జాతర



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో వీరభద్రుడి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పండుగ తర్వాత మూడు రోజులకు ఈ గ్రామంలో వీరభద్రుడి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. వీరభద్రుడు భద్రకాళి కళ్యాణం జరిపి ఆ విగ్రహాలను భాజాబజంత్రీల మధ్య రథం వద్దకు తీసుకువస్తారు. రథంపైన కూర్చోబెట్టిన అనంతరం భక్తులు పేలాలతో అక్షింతల రూపంలో ఆయనపై చల్లుతారు. గత మూడు వందల సంవత్సరాల కిందట వెలసిన వీరభద్రుడి జాతరకు మండలంలోని రెంజల్, దూపల్లి, దండిగుట్ట, కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి తమ మొక్కలను తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బసవేశ్వరుడు.. సాంఘీక విప్లవ కారుడు..

నవతెలంగాణ-జుక్కల్


మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే


కార్యక్రమానికి హాజరైన ప్రజలు

బసవేశ్వరుడు సాంఘీక విప్లవకారుడని పలువురు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బసవేశ్వర చౌక్ వద్ద నూతనంగా నిర్మించిన బసవేశ్వర విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. బసవేశ్వరుడు కుల వ్యవస్థను వ్యతిరేకించాడని తెలిపారు. ప్రజాస్వామ్య వాది, భక్త సంస్కర్త అని వివరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ.. వేమన కన్న ముందు వాడే బసవన్న అని, బసవేశ్వరుడు హైందవ మతాన్ని సంస్కరించిన వారిలో ఒకరని, విశ్వగురుగా పిలుస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెలే సౌదాగర్ గంగారాం మాట్లాడుతూ.. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ విభేదాలను లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెలే, బీజేపి జిల్లా అధ్యక్షురాలు కూమారీ అరుణాతారా మాట్లాడుతూ.. బసవేశ్వరుడు లింగాయత్ సమాజ స్థాపన చేసారని, కర్ణాటకలోని బాగేవాడి ఇతడి జన్మస్థలమని తెలిపారు. మాజీ ఎంపి సురేష్ శెట్కర్ మాట్లాడుతూ.. కుల ప్రాతిపాదికన ఎవరు ఎవరిని వివక్ష చూపవద్దని బసవేశ్వరుడు అన్నారని సూచించారు. జహిరాబాద్ ఎంపీ బిబి పాటీల్ మాట్లాడుతూ.. బసవేశ్వరుడు జీవనోపాధి పొందాలని పట్టు బట్టాడని, తన శారీకర శ్రమ తత్వశాస్త్రం ద్వారా పని "ఈజ్ వర్క్ షిప్" సంస్కృతిని పెంపొందించారని తెలిపారు.

వేదమంత్రాలతో ప్రారంభోత్సవం..

వీరశైవ లింగాయత్ సంభందించిన ముఖ్యమైన గురువులు జుక్కల్ బస్సయప్పా స్వామి, కౌలాస్ మహంతయప్పా స్వామి, ఖత్‌గాం మల్లికార్జునప్పా స్వామి, హనేగాం మహరాజ్, తములుర్ మహరాజ్, బిచ్కుంద మఠ్ సంస్థానదీశుడు శ్రీశైలం పీఠాధిపతి సోమయప్పా స్వాములు మంత్ర వచనాలు చేశారు. విగ్రహప్రతిష్టాపన నియమనిష్టలతో ప్రతిష్టాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ప్రజలకు తప్పని తిప్పలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే మండలంలోని పలు గ్రామాల ప్రజలు ప్రజాపాలన దరఖాస్తులు చేసుకోవడానికి మండల కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం ఉదయం 11గంటల వరకు సంబంధిత అధికార యంత్రం రాలేకపోయారు. అలాగే కార్యాలయానికి వచ్చిన ప్రజలకు కనీస సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేయలేరు. తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతూ ఆరుబయటకు వెళ్తున్నారు. ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, ఎంపీడీవో గోపాలకృష్ణ చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కల్వర్టు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ముప్కాల్


కల్వర్టు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

15వ ఆర్థిక సంఘం ఎంపీటీసీ-2 నిధుల నుంచి విడుదలైన 'ఒక లక్ష యాభై' వేల రూపాయలతో సోమవారం మండల కేంద్రంలో చైతన్య యువజన సంఘం (తెలంగాణ క్రీడా ప్రాంగణం)లో క్రీడాకారుల రాకపోకల సౌకర్యార్థం కల్వర్టు పనులకు ఎంపీటీసీ సభ్యులు పద్మ-కిషన్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బద్దం నర్సారెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్, చిల్క దినేష్, జక్కుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు పంపిణీ చేయండి

- ప్రజావాణిలో అంకాపూర్ గ్రామస్తుల వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన కూలి పని చేసుకునే వారు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. 25 సంవత్సరాల నుండి అద్దె ఇళ్లలో ఉంటూ నరకయాతన అనుభవిస్తున్నామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 ఆగస్టు 7న అంకాపూర్ గ్రామాన్ని సందర్శించి రాష్ట్రంలోనే మొట్టమొదట రెండు పడక గదుల ఇండ్లు నిర్మించి ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చి పది సంవత్సరాలు గడిచిందని తెలిపారు. ఇండ్ల నిర్మాణం చివరి దశకు చేరుకున్న పంపిణీ జరగలేదని అన్నారు. సొంత ఇండ్లు లేక కిరాయిలు చెల్లించలేక పెరిగిన నిత్యావసర ధరలతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. ఇప్పటికైనా ఇండ్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గుండ్ల భారతి పోసాని హిమ రాజ్ నరసయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలన సర్వే చేపట్టాలి

- వైద్యాధికారి సంతోష్ కుమార్


మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 11 నుండి 23 వరకు కుష్టు వ్యాధి నిర్మూలన సర్వే కార్యక్రమం ఉంటుందని, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కుష్టు వ్యాధి సర్వే చేయాలని, ఇంటింటికి తిరిగి పురుషులకు, స్త్రీలకు స్పర్శ లేని చెమట రాని రాగి రంగు మచ్చలు గుర్తించాలని, అనుమానస్పద కేసులు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి పై అధికారులకు వారి పేర్లు విన్నవించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి నిర్మూలన సర్వే కార్యక్రమం పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. వేసవి కాలం దృశ్య తాగునీరు పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే త్రాగాలని ప్రజలలో అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాలలోపు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఉమారాణి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరెడ్డి ,ఆనంద్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మైల్ స్కూల్ డైరెక్టర్ రఫీ గౌహర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు


అవార్డును అందుకుంటున్న పాఠశాల కరస్పాండెంట్ షఫీ గౌహర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్ ద స్కూల్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు దక్కింది. విఆర్ త్రిల్లెడ్ టు అనౌన్స్ దట్ ద ప్రైమ్ టైం మీడియా రీసర్చ్ వారి ఆధ్వర్యంలో గ్లోబల్ ఐకాన్ అవార్డ్స్ కార్యక్రమం ఢిల్లీలో సోమవారం నిర్వహించారు. దేశంలోని బిజినెస్ మ్యాన్స్ ఇండస్ట్రీ లిస్టులో ఎడ్యుకేషనల్ సంస్థల వారు పాల్గొన్నారు. ఇందులో స్మైల్ స్కూల్‌కు బెస్ట్ ప్రీ స్కూల్ ఆక్టివిటీ బెస్ట్ ఎడ్యుకేషన్ కేటగిరిలో సెలెక్ట్ చేశారు. నామినేషన్ల ప్రక్రియ ద్వారా ఈ అవార్డ్స్‌కు సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. డైరెక్టర్ మహమ్మద్ రఫీఉద్దీన్ గోహర్ అవార్డును ద ఫేమస్ పర్సనాలిటీ నొటోరియస్ క్రికెట్ ఐకాన్ ఆఫ్ ఇండియా మిస్టర్ వీరేంద్ర సెహ్వాగ్ చేతుల మీద అందుకున్నారు.. వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ.. ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ మదర్ లాంటిది అని చెప్పారు. కార్యక్రమంలో ప్రైమ్ టైం మీడియా రీసెర్చ్ సంస్థ వివిధ నేషనల్ చానల్స్, స్పోర్ట్స్ పర్సనాలిటీస్ పీపుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఫీ గోహర్ మాట్లాడుతూ తమ పాఠశాల స్టూడెంట్స్‌కు పేరెంట్స్‌కు, ముఖ్యంగా టీచర్స్ వారి కృషి వారి డెడికేటెడ్ వర్క్ చాలా ఉందన్నారు. గతంలో రెండు సార్లు బ్రెయిన్ ఫీడ్ మాక్సిన్ వారి అవార్డు అందుకున్నామని తెలిపారు. ఇప్పుడు ఏకంగా నేషనల్ లెవెల్లో ఒక నేషనల్ మీడియా న్యూస్ ఛానల్స్ సంస్థ ద్వారా ఆర్గనైజ్ చేసిన అవార్డ్స్ ఫంక్షన్లో తమ నామినేషన్ను ఎక్సెప్ట్ చేసి మమ్మల్ని అర్హులుగా ప్రకటించిన ప్రైమ్ టైం మీడియా రీసెర్చ్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

సిసి రోడ్డు పనులకు భూమిపూజ


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు పనులకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఎంపీటీసీ సభ్యురాలు నోముల రజిత నరేందర్ భూమిపూజ చేశారు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూ. 5లక్షల నిధులతో గ్రామంలోని గంగమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు పనులను వారు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయించి గ్రామంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనుల్ని పూర్తి చేస్తామన్నారు. సిసి రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కు గ్రామం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, జిల్లా కిసాన్ కేత్ ఉపాధ్యక్షుడు పడిగేలా ప్రవీణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు రేవతి గంగాధర్, నాయకులు పాలేపు నర్సయ్య, గోపీడీ లింగారెడ్డి, సంతోష్, కుందేటి శ్రీను, భుచ్చి మల్లయ్య, ప్రదీప్, మహేందర్, రాజేశ్వర్, గంగారెడ్డి, క్రాంతి, ,శ్రీకాంత్, రవి, శ్రీధర్, సృజన్, మనోహర్, సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి కష్టాలు


మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు

- జీరో బిల్లుకు అర్హులమైనా.. రాలేదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్చి నెల నుండి 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడితే ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. దానిలో భాగంగానే ఈ నెలలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని నడిపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో రెండువందల యూనిట్ల లోపు వారికి జీరో బిల్లుల కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా వివరాలను సేకరించారు. కానీ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమా ? లేక విద్యుత్ వినియోగదారులు తెలిసి తెలియక ప్రజాపాలన దరఖాస్తు నింపడంలో తప్పిదమా.. తెలియదు గాని ఈ నెలలో ప్రతి ఇంటా విద్యుత్ శాఖ అధికారులు రీడింగ్ సేకరించారు. దీనిలో వందలాదిమంది గృహలక్ష్మికి అనర్హులుగా వచ్చిందని, ఇదే కాకుండా 100 లోపు యూనిట్లు వాడిన తమకు బిల్లులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి వందల సంఖ్యలో క్యూ కట్టారు. బిల్లుల విషయాన్ని పలువురికి విన్నవించిన ఈ నెలలో ఏమి చేయలేమని చేతులెత్తేశారని వారు వాపోతున్నారు. అధికారులు చెప్పేది కూడా ఈసారి ఏదో ఆన్లైన్లో, లేక ఇతరాత్ర కారణాలతోనే అర్హులైన వారికి కూడా బిల్లులు వచ్చాయని, వచ్చిన బిల్లు చెల్లించక తప్పదని అధికారులు వివరించినట్లు లబ్ధిదారులు తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం గ్రామ పంచాయతీలలో విద్యుత్ శాఖ అధికారులు మీటర్లకు సంబంధించిన వివరాలను స్వీకరించాలని ఆదేశాలు ఇచ్చిన రెండు రోజులు గ్రామపంచాయతీలో కూర్చుండి గ్రామంలో అర్హులైన వారి వివరాలను సేకరించ లేదని అంటున్నారు. ఏదో ఒక రోజు, రెండు రోజులపాటు కూర్చుండి మమ అనిపించుకున్నారని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ వారి తప్పిదం వల్లే ఈసారి తమకు బిల్లులు వచ్చాయని ఒక ఇంట్లో వేరువేరుగా నలుగురు ఉన్న ఎవరి మీటర్లు, రేషన్ కార్డులు వేరు ఉన్న దాంట్లో ఇద్దరికి జీరో బిల్లులు రావడం, ఇంకా ఇద్దరికీ బిల్లులు రావడంతో చేసేదేమీ లేక మిన్నకుండి పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులు తీసుకున్నప్పుడు అదికారులు దగ్గర ఉండి చుస్తే ఈ రోజు ఈ పరిస్థితి రాకపోయేదని వారన్నారు. ఆనాడు చాలామంది దరఖాస్తులతో తమకు వచ్చిన కరెంట్ బిల్లుల రసీదు కూడా పొందుపరిచిన ఆన్లైన్‌లో సరిగా నమోదు చేయకుండా నేడు ఇలా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మరోసారి కరెంట్ బిల్లు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గృహలక్ష్మి దరఖాస్తు జిరాక్స్‌లను అందజేయవలసి వస్తుందని జీరో బిల్లులు రాణి వినియోగదారులు పేర్కొంటున్నారు. ఈసారైనా ఎలాంటి తప్పిదాలు లేకుండా విద్యుత్ శాఖ అధికారులు గ్రామపంచాయతీల్లోనైనా మరో చోట జీరో బిల్లులు రాని వారి వివరాలను సేకరించుకొని ఏప్రిల్ నెల నుండి తమకు జీరో బిల్లు వచ్చే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

పెర్కిట్ సొసైటీ చైర్మన్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంట భోజ రెడ్డి పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాస్ రావు సోమవారం తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన 8మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. మిగిలిన నలుగురు పాలక వర్గ డైరెక్టర్లతో సొసైటీ చైర్మెన్ పెంట బోజరెడ్డిపై అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కోపరేటివ్ అధికారికి 16 ఫిబ్రవరి 2024 న సమర్పించి. అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించాలని కోరడం జరిగింది. దీనికి ప్రతిస్పందనగా జిల్లా కోపరేటివ్ అధికారి అవిశ్వాస తీర్మాన పత్రాలను పరిశీలించి 22 ఫిబ్రవరి 2024న పెర్కిట్ సొసైటీ పాలక వర్గ డైరెక్టర్లకు నోటీసులు పంపించడం జరిగిందని తెలిపారు. సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 34(ఏ), సబ్ సెక్షన్ 11 ప్రకారం 2/3 మెజారిటీ అనగా 9 మంది సభ్యుల బలం ఉంటే అవిశ్వాసం నెగ్గుతుందని తెలియజేశారు. ఈ ప్రక్రియను పరిగణలోకి తీసుకుని సోమవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. సుమారు రెండు గంటల అనంతరం అవిశ్వాసానికి 9 మంది డైరెక్టర్ల మెజారిటీ కావాల్సింది ఉండగా సమావేశానికి 8 మంది డైరెక్టర్లు హాజరు అయ్యారు. అవిశ్వానికి 8 మంది మద్దతు పలకగా పెర్కిట్ సొసైటీ చైర్మెన్ పెంట బోజరెడ్డిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా కోపరేటివ్ అధికారి పత్రికా ముఖంగా తెలిపారు. ఇదిలా ఉండగా అవిశ్వాసానికి ముందుకొచ్చిన డైరెక్టర్లు సొసైటీ చైర్మెన్ పై పలు రకాల ఆరోపణలున్నాయని, నాసిరకం రసాయన ఎరువులు తెప్పిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని, అలాగే పంట కొనుగోలు విషయంలో సొసైటీ ఆర్థిక లావాదేవీల్లో చాలా వరకు అవినీతి జరిగిందని, ఏక పక్ష ధోరణితో అటు రైతులను ఇటు డైరెక్టర్లను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆరోపించారు. అందుకే చైర్మెన్ పై అవిశ్వాసానికి తెరలేపామని, ఈ అవిశ్వాసాన్ని వీగిపోయేందుకు కారకులైన అధికారులపై, చైర్మెన్‌పై చర్యలు తీసుకోవాలని పైఅధికారులకు అవసరమైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ విజయవంతం

- ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ అన్నారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్‌లో 15 తీర్మానాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ యూనివర్సిటీల బలపేతం కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు మెస్ బకాయిలను అంటగట్టకుండా డిగ్రీ, పీజీ మెమోలు ఇవ్వాలన్నారు. అన్ని యూనివర్సిటీల్లో దివ్యాంగ విద్యార్థులకు వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్లో తెలంగాణ యూనివర్సిటీకి ప్రతి ఏటా మొండి చూపే చూపెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకుల పల్లి భూపతిరెడ్డి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు సమకూర్చేటట్టు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతోందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల కో కన్వీనర్ లవిశెట్టి ప్రసాద్, నాయకులు దినేశ్, శివ, రఘు, బాబు, కిరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇవ్వాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ నగరంలోనిరాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి, వారి కుటుంబానికి ఆర్థిక భరోసాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష నూటపాదహారు రూపాయలు పంపిణీ చేస్తుందని, ఈ చెక్కులు జారీ చేయడంలో జాప్యం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం అర్జీ పెట్టుకున్న అర్హులందరికీ వీలైనంత త్వరగా చెక్కులు విడుదల చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీ నెరవేర్చాలని, ఆడబిడ్డలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. నగరంలో 895 మందికి చెక్కుల పంపిణీ జరుగుతుందని, అందులో కల్యాణ లక్ష్మి 211, షాదీ ముబారక్ 684 పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, బిజెపి కార్పొరేటర్లు, నాయకులు, ఎమ్మార్వోలు, అధికారులు పాల్గొన్నారు.

నాసిరకంగా సైన్స్ బిల్డింగ్ పనులు

- వేరే కాంట్రాక్టర్‌కు అప్పగించండి
- టీయూ పీడీఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో రూ.18 కోట్లతో నిర్మిస్తున్న సైన్స్ బిల్డింగ్ ను నాసిరకంగా కడుతున్నారని పిడిఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఆరోపించారు. సోమవారం యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో సైన్స్ బిల్డింగ్ ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. 15 రోజుల కిందటే నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదుల్లో పగుళ్లు ఏర్పడ్డాయని యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా కానీ ఇప్పటివరకు తరగతి గదులకు మరమత్తులు చేయలేదని, మొత్తం 8 రూముల్లో ప్లాస్టింగ్ పూర్తయి సున్నం వేసిన తర్వాత పగుళ్లు ఏర్పడ్డాయని బిల్డింగ్ కూలే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కోట్ల రూపాయలతో కట్టిన గదుల్లో పగుళ్లు ఏర్పడడం ఏంటని, నాసింకం పనులపై వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని, పనులు మొత్తం నత్త నడకన నడుస్తూ నాసిరకంగా కడుతున్నారని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రస్తుతం జరుగుతున్న నాసిరకంగా పనులపై వైస్ ఛాన్సలర్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటి నాయకులు రవీందర్, అక్షయ్, హన్మండ్లు, మణికంఠ, సాయికృష్ణ, భాస్కర్, ప్రవీణ్, సాయి ప్రకాష్, శేఖర్, పాల్గొన్నారు.

మోపాల్ మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, టీపీఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్ ఆధ్వర్యంలో మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అఖిలేష్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింలు, ఉపాధ్యక్షులుగా పద్మజ, సహాయ కార్యదర్శిగా హరీష్, కోశాధికారిగా మృదులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా స్వప్న, సాయికుమార్ గౌడ్, వెంకటేష్, శ్యామ్, చైతన్యను ఎన్నుకున్నారు.

నిజామాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి సీనియర్ మహిళల హాకీ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్


హాకీకి ఎంపికైన క్రీడాకారులు

వనపర్తి జిల్లాలో ఇటీవల నిర్వహించిన సీనియర్ ఉమెన్ హాకీ ఓపెన్ సెలక్షన్స్‌లో నిజామాబాద్ జిల్లా నుండి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో మంచి ప్రతిభ కనబరిచిన నిజామాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు దార్ల ప్రీతి, మమత, శ్రీ చందన 14వ హాకీ ఇండియా సీనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్షిప్‌కు ఎంపికయ్యారు. పూణేలో ఈనెల 13 నుండి 23 వరకు జరుగు చాంపియన్షిప్‌లో వీరు పాల్గొంటారని నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి మాట్లాడుతూ.. సెలెక్ట్ అయిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అంతర్జాతీయ స్థాయిలో కూడా వీరు రాణించాలని ఆకాంక్షించారు. ఈ సర్టిఫికెట్స్‌తో ప్రభుత్వ ఉద్యోగానికి 2శాతం రిజర్వేషన్‌కు సహాయపడుతుందని తెలిపారు. వీరిని నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు టి విద్యాసాగర్ రెడ్డి, కోశాధికారి పింజ సురేందర్, సంఘ సభ్యులు జీవీ నరసింహారెడ్డి , సంయుక్త కార్యదర్శి ఎండి ఆరిఫ్, ఎండి జావిద్, డి. చిన్నయ్య, రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. అంజు, ఈసీ మెంబర్స్ నాగేష్, సంతోష్ ఠాకూర్, సీనియర్ హాకీ క్రీడాకారులు జిమ్మి రవి, సుధీర్, కత్తి శ్రీనివాస్ ,నవనీత్, రాహుల్, సాయి తేజ వీరిని అభినందించారు.

గౌడ కుల సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

- రూ.4లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేసిన ఎంపీ అరవింద్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గౌడ కుల సంఘ భవనం నిర్మాణానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి చొరవతో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ తన ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ. 4లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు సోమవారం గౌడ కుల సంఘ భవన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని ఆర్మూర్ లోని ఎంపీ క్యాంప్ ఆఫీస్‌లో పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ చేతులమీదుగా కమ్మర్ పల్లి గౌడ కుల సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నిధుల మంజూరికి కృషిచేసిన ఏలేటి మల్లికార్జున్ రెడ్డికి, నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్ కు కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోకల నర్సయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చింత ప్రవీణ్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రెంజర్ల గంగాధర్, నవీన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, బిజెపి నాయకులు, గౌడ కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు

- క్రికెటర్ సెహ్వాగ్ చేతులమీదుగా అవార్డు అందుకున్న కరస్పాండెంట్ షఫీ



అవార్డును అందుకుంటున్న పాఠశాల కరస్పాండెంట్ షఫీ

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు గ్లోబల్ ఐకాన్ 2024 అవార్డును అందుకుంది. ఢిల్లీకి చెందిన ప్రముఖ జాతీయ రీసెర్చ్ అండ్ ప్రైమ్ టైం ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దేశంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక సేవనందిస్తున్న డాక్టర్లు, నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాలలపై చేపట్టిన సర్వేలో భీంగల్‌లోని లిటిల్ ఫ్లవర్ ను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని రెడిసన్ బ్లూ ప్లాజా హెూటల్లో జరిగిన కార్యక్రమంలో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ చేతుల మీదుగా అవార్డును పాఠశాల కరస్పాండెంట్ షఫీకి అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ షఫీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని తమ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఐఐటి, నీట్ వంటి పరీక్షలలో విజయం సాధించి క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్నారని, దీనిని గుర్తించి పాఠశాలకు అవార్డు అందజేశారన్నా రు. ఈ సందర్భంగా పాఠశాల బోధన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

నవతెలంగాణ
కామారెడ్డి
3
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

పలు గ్రామాల్లో నర్సరీల పరిశీలన



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా, కందకుర్తి, పేపర్‌మిల్లు గ్రామాలలోని నర్సరీలను ఎంపీడీవో శంకర్, మండల సూపరింటెండెంట్ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. నర్సరీలలో మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందిస్తూ వాటి సంరక్షణ బాధ్యతను కార్యదర్శులు చేపట్టాలని ఆయన సూచించారు. నేటి సౌకర్యం సమృద్ధిగా ఉన్న చోటనే నర్సరీలను పెంచాలని ఆయన అన్నారు. మొక్కలు నాటడం ముఖ్యం కాదని వాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్తెపు శంకర్, గ్రామ కార్యదర్శి సతీష్ చంద్ర, బి.రాణి, అఫ్రీన్, రాము, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో వరి పంటలు పరిశీలన



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలోని వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ సోమవారం పరిశీలించారు. వరి పంట ఏ దశలో ఉంది, సాగునీరు లభ్యత, పంటలు ఎప్పటి వరకు కోతదశకు వస్తాయని అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వ్యవసాయ విద్యను అధికారులు సర్వే చేసిన పంట నమోదు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి కవిత, రైతులు సురేందర్‌గౌడ్, సుదర్శన్, శంకర్‌గౌడ్, బోయ సతీష్, ప్రవీణ్, ఇస్మాయిల్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూతరి రమేష్ అన్నారు. బీబీపేట మండలం లోని మాందాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ఆర్ఈజీయస్ లో భాగంగా సీసీ రోడ్డును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూతరి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు యన్ఆర్ఈజీఎస్ నుంచి 10 లక్షల రూపాయలు మంజూరు చేసి గ్రామంలో సిసి రోడ్డును ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రొడ్డ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రొడ్డ బాబు, రాజిరెడ్డి, నరసింహులు, మధుసూదన్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ద్వారా స్వీకరించిన అర్జీలను

జాప్యం లేకుండా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజావాణి ద్వారా స్వీకరించిన అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి 48 అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా ఇందులో భూ సమస్యలకు సంబంధించి 24 వినతులు రాగా, రెండు పడకల ఇల్లు కావాలని 6, ఉపాధి కల్పనకై 5 వినతులు వచ్చాయి. వీటితోపాటు పంచాయతీ రాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్, పోలీసు శాఖకు సంబంధించిన వచ్చిన వినతులను ఆయా శాఖాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, తద్వారా దరఖాస్తుదారులకు సత్వర మేలు చేకూరే అవకాశముందని అన్నారు. ముఖ్యంగా నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాల్సిన అర్జీలకు ప్రాధాన్యతని ఇచ్చి వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా స్థాయితో పాటు క్రిందిస్థాయి అధికారులు సైతం ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కొన్ని ఫిర్యాదులను స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులను తన దగ్గరకు పిలిపించుకొని వాటి పరిష్కారానికి మార్గాలు సూచిస్తూ చర్యలు తీసుకోవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ పిడి చందర్‌నాయక్, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బావయ్య, కలెక్టరేట్ ఏ.ఓ. మసూర్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

జిపి కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. గత మూడు నెలల బకాయి వేతనాలను మంజూరు చేయాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జంగం గంగాధర్, జొగ్గరి పద్మ, కుంట సంతోష్, గారిగింట్ల శ్రీనివాస్, రాధా తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు క్రీడాపోటీలు

నవతెలంగాణ-బోధన్

మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో అంగన్వాడీ కార్యకర్తలకు క్రీడా పోటీలు నిర్వహించారు. రంగోలీ, మ్యూజికల్ చైర్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ లాంటి క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీడీపిఓ జానకి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు గంగావేణి, గోపి లక్ష్మి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు తప్పకుండా అమలు

- కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి యువజన సంఘం మండలాధ్యక్షులు రంజిత్‌గౌడ్



జీరో బిల్లును అందజేస్తున నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండలాధ్యక్షులు ఇల్లెందుల రంజిత్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో గృహజ్యోతి పథకం కింద అర్హులైన జీరో కరెంటు బిల్లును నాయకులు, విద్యుత్‌శాఖ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లెందుల రంజిత్‌గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేద బడుగు బలహీనవర్గాల అందర్నీ తెలంగాణ ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ఆరు పథకాలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు చేపూర్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు బుడ్డ లక్ష్మణ్, రాములు, విష్ణువర్ధన్‌గౌడ్, కాకి లక్ష్మణ్, విద్యుత్‌శాఖ మంగళ్‌పాడ్ లైన్ ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ తదితరులున్నారు.

యాద్గార్‌పూర్‌లో సిసి రోడ్లు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.10 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు పనులను ఎంపీటీసీ అనంత విటల్ సోమవారం ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ ఏనుగు రవీందర్‌రెడ్డి మాట ప్రకారం యాద్గార్పూర్ గ్రామంలో సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్‌రావు, కోటగిరి ఎంపీటీసీ డీసీసీ డెలిగేట్ కొట్టం మనోహర్, డీసీసీ డెలిగేట్ గంగప్రసాద్, మాజీ ఎంపీటీసీ సలీం, జిల్లా కార్యదర్శి వాహిద్ హుస్సేన్, మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామ కార్యదర్శి సునంద, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీటీసీ విఠల్

దోమకొండ : బీబీపేట మండల పరిషత్ కార్యాలయంలో మల్టీపర్పస్ గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ పూర్ణ చంద్రోదయకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని, ట్రెజరీలలో బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వేతనాలు రాకపోవడంతో కుటుంబం పోషణకు ఇబ్బందులు పడుతున్నా మని అన్నారు. ప్రభుత్వం దృష్టిసారించి కార్మికులకు వెంటనే వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు నర్సింలు, శివరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన దత్తు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఆర్డీవోగా దత్తు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బోధన్ తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది నూతన ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బోధన్ ఆర్డీవోగా పనిచేసిన రాజాగౌడ్ ఆర్మూర్ ఆర్డీఓగా బదిలీపై వెళ్లగా జగిత్యాల నుంచి దత్తు బోధన్ డివిజన్ ఆర్డీఓగా బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. బోధన్ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో దత్తు అన్నారు. రెవెన్యూ సిబ్బంది తమ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా వారి సమస్యలను ఆలకించి పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు.

ఇష్టంతో కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

- పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్‌రావు

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు మహాసభలో ఆయన పాల్గొన్నారు. తొమ్మిదవ తరగతి విద్యార్థి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు మాసం ఏర్పాటు చేశారని, పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లయితే వారికి మార్గదర్శకంగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల్లో నిత్య పోటీలు ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, పరమేశ్వర్, రాధా, రాజేశ్వర్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ బాబన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదానోపాధ్యాయులు

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండారు నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా సంస్థాగత మార్పుల్లో భాగంగా కామారెడ్డి బీజేపీ నూతన కమిటీని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారా నియమించారు. అందులో భాగంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కామారెడ్డి పట్టణం లింగాపూర్ గ్రామానికి చెందిన బండారు నరేందర్‌రెడ్డిని నియమించారు.

డ్రయినేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో డ్రైనేజీ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యేకు వైస్ ఎంపిపి గాదారి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆస రాజు, సురేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం పాత కమిటీ రద్దు

- నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని కళాభారతిలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఫౌండర్ వ్యవస్థాపకులు జేబి రాజు, రాష్ట్ర అధ్యక్షులు అవిలయ్య హాజరయ్యారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా అంబేద్కర్ సంఘం పాత కమిటీని రద్దు చేస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కోత్తోల్ల గంగారం, ప్రధాన కార్యదర్శి గైనిరాజు, కోశాధికారి పేరుమండ్ల రాములు, గౌరవ అధ్యక్షులుగా కొత్తపల్లి మల్లన్న, సంఘీ రాజలింగంను ఎన్నుకున్నారు.

గృహజ్యోతి పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గాంధారి



జీరో బిల్లును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గృహజ్యోతి పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని కరక్‌వాడి గ్రామంలో గృహజ్యోతి పథకాన్ని విద్యుత్ అధికారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. గ్రామస్తులందరూ గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మాజీ భాస్కర్‌రావు పిలుపునిచ్చారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని కోమలంచ గ్రామంలో రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు మండల మాజీ జెడ్పీటిసి చీకోటి జయప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో దశలవారీగా రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లయ్యగారి ఆకాష్, నాయకులు నాగభూషణంగౌడ్, నారాయణ, కిష్టగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీపై ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య విస్తీర్ణ అధికారి

నవతెలంగాణ-రెంజల్

జిల్లా వైద్య శాఖ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని వీరన్నగుట్ట, కూనేపల్లి, దూపల్లి గ్రామాలలో లెప్రసీ లక్షణాలపై ఇంటింటి సర్వే నిర్వహించినట్లు ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. లెప్రసీ లక్షణాల గురించి ఆయన వివరించారు. ఆశలు ఇంటింటికి వెళ్లి ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు ఉన్నావా అని అడిగి తెలుసుకున్నారు. కాళ్లు, చేతులు, నరాలలో వాపు, నొప్పి, తిమ్మిర్లు వచ్చినట్లయితే అలాంటి వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వద్దకు పంపించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సర్వే 11 నుంచి 24 వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాలలోని ఆశలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధర్వంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-కోటగిరి

పీఆర్టీయూటీఎస్ కోటగిరి మండల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల రెవెన్యూ అధికారి సునీత, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, కోటగిరి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎత్తొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అలివేలు, పిఆర్టియు మండల ప్రెసిడెంట్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్, అసోసియేట్ జిల్లా అధ్యక్షులు శానం సాయిలు, బోధన్ డివిజన్ అధ్యక్షులు అంబెల్లి శంకర్, జిల్లా టెక్నికల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు సాయిబాబా, బర్ల సాయిలు, హర్షద్, మండల బాధ్యులు ఉషం సుజాత, పాషా, పొతంగల్ మండల నోడల్ ఆఫీసర్ లోలా శంకర్, కారేగాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గారావు, పోతంగల్ మండలాధ్యక్షులు సూదాం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళ ఉపాధ్యాయులకు సన్మానం

సోంపూర్‌లో నీటి కోసం బోర్‌వెల్

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని సోంపూర్ గ్రామ పంచాయతీలోని రాంగంగానగర్ గ్రామంలో ఏనుగు రవీందర్‌రెడ్డి సహకారంతో బోరు వేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు పవర్ అవుసాజి, పోతంగల్ ఎస్సి సెల్ రాజేందర్, షిండే, విలాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ స్కూల్ విద్యార్థికి ద్వితీయ బహుమతి

నవతెలంగాణ-మద్నూర్

నిజామాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇంటర్ స్కూల్ కాంపిటేషన్‌లో మద్నూర్ మండల కేంద్రంలో గల వాసవి స్కూల్ 4వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిరాజ్ రెండవ బహుమతి సాధించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో వాసవీ స్కూల్ కరస్పాండెంట్ ఉమాకాంత్, జిల్లా స్థాయి ఇంటర్ కాంపిటేషన్ నిర్వహించిన అధికారులు బహుమతులు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కేంద్రంలో అర్జీల ప్రక్రియ పరిశీలన

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల అమలులో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వాటిని సత్వరమే పరిష్కరించడానికి మండల పరిషత్ కార్యాలయాలలో సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రంలో ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరిస్తూ వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీఓ మహబూబ్ సేవా కేంద్రంలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీల ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు 90 ఆర్జీలు వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించడం జరిగిందన్నారు. సేవా కేంద్రంను రోజు నిర్వహిస్తామని లబ్ధిదారులు ఏ పథకం కింద లబ్ధి పొందకపోతే వారి దరఖాస్తులను స్వీకరించి వెంటనే పరిష్కరిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు. సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న కిసాన్ మహా పంచాయతీనీ విజయవంతం చేయండి

- సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 14న జాతీయ రైతు సంఘాల ఎస్కేయం పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ, కిసాన్ మహా పంచాయతీ విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చించి నిర్ణయించినట్లు సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతంలో రైతు ఉద్యమాలకు తలోగ్గి వారి డిమాండ్ల సాధనకు ఒప్పుకొని ఇప్పుడు దొంగ చాటున పాత నిబంధనలోనే కొనసాగిస్తామని వారి ప్రయత్నాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఎలక్ట్రిక్ పవర్ ప్లాంట్స్, రహదారులు, సముద్రమార్గాలు, రైల్వేలు తదితర సంస్థలు ఈ దేశ సంపదను అదానీకి చెందిన సంస్థలకు అప్పచెప్పడం జరిగిందని, ప్రస్తుతం మిగిలింది ఈ వ్యవసాయ రంగం ఒక్కటేనని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మనం కాపాడుకోకపోతే వ్యవసాయ రంగం ఈ దేశంలో తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలు తెలిసిన దాదాపు 200 వందలకుపైగా రైతు సంఘాలు దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మళ్లీ ఉద్యమాలు చేపట్టడం జరిగిందని, సంయుక్త కిసాన్ సంఘ్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 14న పంచాయతీలు నిరసన ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైతులు, కార్మికులు, కర్షకులు, మేధావులు అందరూ పాల్గొని కిసాన్ సంయుక్త మహా పంచాయతీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి పరమేష్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎ.ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ అంబన్న, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, ఉపాధ్యక్షులు ముఖేష్, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, పీవైఎల్ నాయకులు దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజావాణికి 95 ఫిర్యాదులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను వెంటదివెంట పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకోసం ఇంటింటా ప్రచారం చేయాలి : ఎంపీ



నవతెలంగాణ-నందిపేట్

బీజేపీ గెలుపునకు కార్యకర్తలందరు కృషి చేయాలని ఎంపీ అర్వింద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో ఢిల్లీలో ప్రయాసం ఇందులో వికాసం బిజెపి ఉమ్మడి నందిపేట డొంకేశ్వర్ మండలాల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ ధర్మపురి అరవింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మరోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ గెలవాడానికి బీజేపీ శ్రేణులంత కంకణం కట్టుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయల న్నారు. కార్యకర్తలే పార్టీకి ఎంతో బలమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూతం సాయి రెడ్డి, సాయికుమార్, ఎంపిటిసి పటేళ్ల రాజు యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాగ సురేష్, మాజీ ఎంపిటిసి గాండ్ల నర్సాగౌడ్, కొండపురం భోజన్న, గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కస్తూరి గంగాధర్, గుండ్ల ముత్యం, కొత్తూరు మాజీ సర్పంచ్ సాయగౌడ్, గడ్డం చిన్న రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు విద్యను దూరం చేసేందుకే ఎన్ఈపి

- **ఎఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు రఘురాం**
- **టీయూలో సంతకాల సేకరణ**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసే నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు రఘురాం పిలుపునిచ్చారు. ఎన్ఈపికి వ్యతిరేకంగా తెలంగాణ యూనివర్సిటీలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. విద్యా కాషాయీకరణ, విద్య ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020 సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించాలని కోరారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చారని విమర్శించారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని అన్నారు. దేశంలో జాతీయ విద్యా విధానంవల్ల దాదాపు 90శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని, విద్యా వ్యాపారీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం దూరం చేసే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి బదులు హిందుత్వ రాజ్యాన్ని స్థాపించడానికి బాటలు వేస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారని తెలిపారు. ఇప్పటికే పేద వర్గాలకు అందని ద్రాక్షగా మారిన విద్య, ఎన్ఈపి అమలుతో విద్యకు మరింత దూరం అవుతారని తెలిపారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఈపికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. మేధోమథనానికి కేంద్రాలైన



మాట్లాడుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

యూనివర్సిటీ విద్యార్థులు ఎన్ఈపికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి మద్దతు తెలిపిన తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ పున్నయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ చారి, స్వామి, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి కరక గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్, పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి జన్నారం రాజేశ్వర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, యూనివర్సిటీ నాయ కులు అజయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించడం పట్ల హర్షం

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం**
- **ఇండ్ల పట్టాలు ఇవ్వాలని విజ్ఞాపన ర్యాలీ**

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ, ఇండ్ల పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ ఇండ్లు, ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షులు ధ్యారంగుల కృష్ణ, ఐఎన్‌టీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో విజ్ఞాపన ర్యాలీ సోమవారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలాబిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్ టియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలకు ఇండ్లు ఇవ్వకుండా కాలయాపన చేసిందని, అందుకే ప్రజలు అధికారానికి దూరంగా ఉంచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించడం పట్ల ఇండ్లు ఇండ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు ధ్యారంగుల కృష్ణ, హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ నగరంలో దుబ్బ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు వ్యక్తిగత దరఖాస్తులను సమర్పించారు.

నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరికి ఇండ్ల పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేర్రిపోతుల శ్రీధర్, గంగాధర్, భాస్కర్, లావణ్య, రామచందర్, మునవర్, రహమత్, స్వప్న, లత, నాగలక్ష్మి మరియు 400 మంది ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 841మంది గైర్హాజరు

- **ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/మాక్లూర్

ఇంటర్ మొదటి సంవత్సరం అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం పరీక్షల్లో జిల్లాలో ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాగా, 841 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని నవీపెట్ మోడల్ కళాశాలలో ఓ విద్యార్థిని చీటీలు రాస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు. జిల్లాలో ఈరోజు 95.7 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్ ల ఆధ్వర్యంలో 50పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 8 మంది విద్యార్థుల పై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ 4 కళాశాలలు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 7 పరీక్ష కేంద్రాలను, హై పవర్ కమిటీ డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో 6 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు 25 పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌లు 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు. జిల్లాలో మొత్తం 19,454 మంది విద్యార్థులకు గాను 18,613 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు.

నలుగురు..

మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో నలుగు రు గైర్హాజరు అయినట్లు పరీక్ష కేంద్రం ఇంఛార్జి శివకుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు మొత్తం 183 మంది విద్యార్థులకుగాను 179 మంది విద్యార్థులు పైకాలకు హాజరు అయినట్లు తెలిపారు.

సిసి రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సిసి రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే డా ఆర్. భూపతిరెడ్డి సహకారంతో మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి అభివృద్ధికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయడం వల్ల బ్రాహ్మణ పల్లి గ్రామంలో 5 లక్షల విలువ గల సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. గెలిచిన అనతి కాలంలోనే గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, ప్రజలు కృతజ్ఞత లు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సికింద్రాపూర్‌లో

మండలం సికింద్రాపూర్ గ్రామంలో ఎన్నారైజిస్ ద్వారా మంజూరైన సిసి రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి భూమి పూజ చేశారు. మంజూరు కి సహకరించిన నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలియజే శారు. సికింద్రాపూర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగొట్ గ్రామంలో



భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన సిసి రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. నిధులకు సహకరించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ అధ్యక్షులు దేవరాజుల గంగాధర్, రైతు విభాగం అధ్యక్షుడు వాకిటి పెద్ద బొజ్జన్న, ఉపాధ్యక్షులు ఆకుల రవీందర్, గ్రామ ప్రధాన కార్యదర్శి బొంబాయి గంగాధర్, మాజీ సర్పంచ్ తలారి గంగాధర్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలు తెలపాలి

- **సిపిఎం ఆధ్వర్యంలో వినతి**

నవతెలంగాణ-ఆర్మూర్

రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలను తెలపాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐఎం మండల కార్యదర్శి కూతాడు ఎల్లయ్య మాట్లాడుతూ బాండ్ల వివరాలను తెలిపే వరకు సుప్రీంకోర్టు నిర్ణయం పూర్తిగా అమలు జరిగినట్లు కాదని ఫిబ్రవరి 15న ఇచ్చిన తీర్పులో ఎస్బిఐని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మూడు వారాల్లో తెలియజేయాలని కూడా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎస్బిఐ కి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ఈనెల ఆరవ తేదీన ముగిసిందని అన్నారు. ఎన్నికల బాండ్లను సమాచారాన్ని గడువులోగా అందజేయడం



వినతిపత్రాన్ని అందజేస్తున్న సిపిఎం నాయకులు

కష్టమని, మరో మూడు నెలల సమయం కావాలని కోరుతూ న్యాయస్థానంలో ఓ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. దీనిప్రకారం జూన్ 30 వరకు సమయం కోరిందన్నారు. అప్పటికి దేశంలో సార్వత్రిక ఎన్నికల పూర్తయిపోతాయని, కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్బిఐ పని చేస్తుందనేది స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా తమకు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేసిన వారి వివరాలు ప్రజలకు తెలియకూడదని ఆ పార్టీ భావిస్తుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ విషయంపై చర్చ జరగడం బిజెపికి సుతారం నచ్చడం లేదని, అందుకే ఆ పార్టీ ఎస్బిఐపై ఒత్తిడి తెచ్చి కాలయాపనకు ప్రయత్నిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధల నాగరాజు ఎస్ కే అమీర్, జవహర్ సింగ్, ఎండి రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బడా భీంగల్ గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళం వేసి ఉన్న జంగం రాజేశ్వర్, జంగం రాజేశ్వరి ఇండ్ల తాళాలు పగలగొట్టారు. రాజేశ్వరి ఇంటిలో నుండి సుమారుగా 8 తులాల బంగారు ఆభరణాలు, రాజేశ్వర్ ఇంటిలో నుండి సుమారుగా ఏడు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు కూడా దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు భీంగల్ ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- **సిడిపిఓ భార్గవి**



మాట్లాడుతున్న సిడిపిఓ భార్గవి

నవతెలంగాణ-ఆర్మూర్

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సిడిపిఓ భార్గవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఐసిడిఎస్ పట్టణ పరిధిలోని అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు కబడ్డీ, రన్నింగ్, మ్యూజికల్ చైర్, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు ప్రపంచంలోని అన్ని దేశాలలో శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు ఇతర రంగాలలో సైతం మహిళలే అగ్రపదాన ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకురాలు తార, అంగన్వాడి సూపర్వైజర్లు వెంకట రమణమ్మ ,సమత, శ్రీదేవి, రేఖ, రమ, మాధవి ,అనురాధ, రాణి ,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముగింపు



జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దుర్గనగర్ తండా గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శీతాకాల శిబిరం సోమవారం ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని డా. సరిత మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలో మహిళా దినోత్సవం ఏర్పాటు చేసి మహిళల గొప్పదనాన్ని వివరించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలు అయిన గ్రామ మహిళలకు సన్మానం చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కే లావణ్య అధ్యక్షత వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వాలంటీర్స్ చేసిన సేవలను కొనియాడారు. గ్రామాల్లో పరిశుభ్రతను పాటించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, తద్వారా అంటురోగాలు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి స్వాతి, గ్రామ ప్రజలు వాలంటీర్స్ తమ గ్రామంలో చేసిన అవేర్నెస్ ప్రోగ్రాం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను గ్రామస్తులకు వివరించినందుకు వాలంటీర్స్‌ను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ పద్మమ్మ, వాలంటీర్స్‌కు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఎన్ఎస్ఎస్ మెంబర్స్ డి. సుమలత, పి. శ్వేత పాల్గొన్నారు.

నడ్పల్లి తైబజార్ వేలం వాయిదా

- **నేడు మరోసారి వేలం**



వేలంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలకేంద్రంలోని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ తై బజార్ వేలం వాయిదా వేసినట్లు ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి నిట్టు కిషన్ రావు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సోమవారం గ్రామ పంచాయతీలో తై బజార్ వేలం పాట నిర్వహించగా ముందస్తుగా నిర్ణయించిన మేరకు వేలం రాకపోవడంతో మరోసారి మంగళవారం వేలం వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వేలం ధార రాకపోతే మూడు సార్లు వేలం నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. తై బజార్, వారాంతపు సంత కలుపుకుని వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి రోజు ఐదుగురు వేలంపాటలో పాల్గొన్నారని ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి నిట్టు కిషన్ రావు వివరించారు.

జీరో విద్యుత్ బిల్లులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలో ప్రజాపాలనలో బాగంగా ఇచ్చిన హామీలో ఒకటైన (200 యూనిట్ల ఉచిత విద్యుత్) జీరో బిల్ రావడం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం తొర్లికొండ గ్రామంలో విద్యుత్ అధికారులు ప్రతి ఇంటికి జీరో విద్యుత్తు బిల్లును అందజేశారని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం గ్రామంలోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ పెండే ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు అధికమైనందున ప్రయాణికుల, ప్రజల దాహాన్ని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ నరసింహ సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని గ్రామంలోని ఇతర యువజన సంఘాల సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సేవా సమితి సభ్యులు రతన్, మల్లెల ప్రశాంత్, జాగిర్యాల రాజేష్, సృజన్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సిసిరోడ్లు, డ్రయినేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని ముచ్కూర్ గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోధిరే స్వామి ఉపాధ్యక్షులు జెజే నరసయ్య, మండల యూత్ అధ్యక్షుడు అన్వేష్ బాల్కొండ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నాగేంద్ర, వాక మహేష్ మండల కాంగ్రెస్ నాయకులు, ముచ్కూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లా స్థాయి అబాకస్ టాలెంట్ టెస్ట్‌లో..

- **కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ**



బహుమతులను అందుకున్న కృష్ణవేణి విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు జిల్లా స్థాయి అబాయస్ వేదిక్ మాథ్స్ టాలెంట్ టెస్ట్ లో మంచి ప్రతిభను సాధించి బహుమతులను పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి అబాకాస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించగా జిల్లా స్థాయిలో 25 పాఠశాలలు పాల్గొన్నాయి. అందులో బాల్కొండ కృష్ణవేణి పాఠశాల నుంచి 22 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారని ఇందులో ప్రథమ స్థానంలో 3, ద్వితీయ స్థానంలో 5.తృతీయ స్థానంలో 1, 4వ స్థానంలో 13 బహుమతులను సాధించినట్లు ఆయన తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అబాకస్ బోధకులు(ప్రత్యుష, కీర్తి) విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కోటగిరి భాను చందర్, ఆకుల లక్ష్మణ్ అభినందించారు.

4 లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని పద్మశాలీ సంఘం శివ మార్కండేయ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ అరవింద్ 4 లక్షల రూపాయలు మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీని సంఘ సభ్యులకు అందజేసినట్టు తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు పద్మశాలీ సంఘ సభ్యులు ఎంపీ అరవింద్ కు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, బీజేపీ నాయకులు తోకల నర్సయ్య, పద్మశాలీ సంఘ సభ్యులు కామని శివకుమార్, మనోజ్, గంగేశ్వర్, గజానంద్, మనోహర్ పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న దృశ్యం

ద్వాదశ దినకర్మలో పాల్గొన్న ప్రముఖులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి వినయ్ రెడ్డి నానమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమం పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్ లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తాహెర్ బిన్, రాష్ట్ర మార్క్ ఫైడ్ చైర్మన్ మార గంగారెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, సాయిబాబా గౌడ్, విజయేందర్ రెడ్డి, చిట్టి రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను విడుదల చేయాలి

- పెండింగ్‌లో గౌరవ వేతనం, గుడ్ల బిల్లు, అల్పాహారం బిల్లులు
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10వేలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు 2023 నవంబర్ నెల నుండి గౌరవ వేతనం, అల్పాహారం, బిల్లులు పెండింగ్లో ఉన్నాయన్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంట చేసి పెడుతున్నారని తెలిపారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ విల్లులు క్లియర్ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉన్న వేతనంపై రూ.2,000 పెరిగిందని, అదికూడా కూడా సక్రమంగా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా చేస్తున్నారని, వెంటనే కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని, కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలని అన్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదు. పైగా అల్పాహారం (టిఫిన్) పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. టిఫిన్ బడ్జెట్ కేటాయించకుండా అల్పాహారం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వండి పెట్టడం సాధ్యం కాదుని, అల్పాహార పథకం పనులకు కూడా మధ్యాహ్న భోజన పథకం కార్మికులే చేయాల్సి వస్తుంది. పని భారం పెరుగుతుందని, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని అన్నారు. వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ 2 గుడ్లే సరిపోదు. 3 గుడ్లు ఎలా పెట్టాలని, అదనంగా బడ్జెట్ కేటాయించాలి లేదా అంగన్వాడీ సెం టర్లకు సప్లయ్ చేసినట్లుగా మ ధ్యాహ్న భోజన పథకానికి కూడా సప్లయ్ చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వ హణకు అవస రమైన గ్యాస్‌ను సబ్సిడీపై ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10వేల వేతనం వెంటనే అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, సాయి రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ పోస్టుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని, దరఖాస్తు గడవు సోమవారంతో ముగిసిందని నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బిఎస్‌కేలో, జాతీయ ఆరోగ్య మిషన్‌లో వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్సులు, డాటా ఎంట్రీ ఆపరేటర్, న్యూట్రిషన్ కౌన్సిలర్, ఎపిడమాలజిస్ట్, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉద్యోగాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్ దరఖాస్తు గడువు ముగిసిందని పేర్కొన్నారు. ఈ పోస్టులన్నీ పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. నియామకాల విషయంలో ఎలాంటి దళారులు, పైరవీకారులను అంగీకరించమని తెలిపారు. దరఖాస్తుదారులు పైరవీకారులను నమ్మి వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ఇంతకు ముందు జరిగిన అన్ని నియామకాలు పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు, దరఖాస్తుదారులకు పైరవీలకు సంబంధించిన సమాచారం తెలిస్తే కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఔట్ లెట్ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే నిజామాబాద్ జిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ పంపును సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రైవేటు పెట్రోల్ బంకుల కంటే కూడా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఔట్ లెట్ ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నాయని అన్నారు. అనంతరం పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగినవార్ మాట్లాడుతూ... ఈ పెట్రొల్ బంక్ నుండి వచ్చే లాభాలను పూర్తిగా పోలీస్ కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తామని తెలిపారు. అనంతరం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సిజిఎం శుభ్రత్ రత్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలోని పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో ఐఓసి ఔట్ లెట్‌ను ప్రారంభించడం ఇదే ప్రథమం అని అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, జైళ్లశాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఔట్ లెట్‌కు ప్రజలు పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ లాభాలతో నడుస్తున్న సందర్భాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఐపీఎస్ బి. చైతన్య రెడ్డి, సీనియర్ మేనేజర్ మోహన్ కిషోర్, నిజామాబాద్, ఆర్మడ్ ఏసిపిలు, రాజా వెంకట్ రెడ్డి, నాగయ్య, నిజామాబాద్ ఐఓసిఎల్ ఆఫీసర్ క్రాంతి కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామంలో ప్లాస్టిక్ కనిపించకూడదు

- ఆర్మూర్ డిఎల్పిఓ శివకృష్ణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలో ప్రతి గ్రామంలో ప్లాస్టిక్ ఎక్కడ కనిపించకూడదని ఆర్మూర్ డిఎల్పిఓ శివకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో డి ఎల్ పి ఓ శివకృష్ణ పారిశుద్ధ పనులను పరిశీలించారు. మనోహరాబాద్ గ్రామంలో పనులను పరిశీలించి తగు సూచనలను ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు ఉయదం 5 గంటల నుంచి ఏడు గంటల వరకు గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సేకరించాలన్నారు. ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు ప్రతి వీధిలోని రోడ్లను శుభ్రపరచాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ చెత్తను ఇంటి బయట పడవేయకుండా అవగాహన కల్పిస్తూ గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచాలని హెచ్చరించారు. గ్రామంలో ఎంట్రెన్స్ నుండి చివరి వరకు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పంచాయతీ కార్యదర్శి తీసుకొని నేటి నుంచి ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుద్ధ కార్మికులతో శుభ్రం చేయించాలని సూచించారు. ఇంటి టాక్స్ లను త్వరగా వసూలు చేయాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి యూసఫ్ ఖాన్, పంచాయతీ ప్రత్యేక అధికారి బ్రహ్మానందం, పంచాయతీ కార్యదర్శి నరేష్, కారోబార్ ఇందూర్ రాజు, పారిశుద్ధ కార్మికులు ఉన్నారు.

నేడు ఏర్గట్ల మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలో ఈ నెల 12న మంగళవారం ఎంపీపీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపిడిఓ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ట్రాఫిక్ సిబ్బందికి కంటి అద్దాలు, వాటర్ బాటిల్స్ అందజేత



ట్రాఫిక్ సిబ్బందికి వాటర్‌బాటిల్స్ అందజేస్తున్న సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ట్రాఫిక్ సిబ్బందికి చలువ కంటి అద్దాలను, కూలింగ్ స్టోరేజీ వాటర్ బాటిల్స్‌ను పోలీస్ కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగినవార్ సిబ్బందికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. అతినీలలోహిత కిరణాల వలన జబ్బులువచ్చి అనారోగ్యానికి గురి అవుతున్న సందర్భంగా ఇలాంటి కంటి అద్దాలను సిబ్బంది తప్పక దరించాలన్నారు. వీటివల్ల దుమ్ము ధూళితో కంటికి ఎలాంటి ప్రమాదం కలుగదని తెలిపారు. ప్రజలతో మర్యాదతో వ్యవహరించాలని, ఇంకా ఎలాంటి అవసరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి నారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, మోక్ష్ ఫ్యాషన్ ప్రొపరేటర్ గాదే ప్రవీణ్ కుమార్, టాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులతో ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం

- ఒకరు మృతి, చికిత్స పొందుతున్న మరొకరు

నవతెలంగాణ-భీంగల్

వేధింపులు తట్టుకోలేక భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. వీరిలో ఒకరు మృతిచెందగా మరొకరు చికిత్స పొందుతున్నారు. భీంగల్ ఎస్సై హరిబాబు వివరాల ప్రకారం.. కమ్మరి నరేష్(32) రెండు నెలల క్రితం భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన సూర సుధాకర్ వద్ద కారు రెంటుకు తీసుకొని ఆర్మూర్ వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురవడంతో ప్రమాదంలో కారు చెడిపోవడంతో దానిని రిపేరు చేయించేందుకు లక్ష రూపాయలు అయ్యింది. అది వెంటనే చెల్లించాలని సూర సుధాకర్, సుర రాజినిష్ నరేష్‌తోపాటు మరో వ్యక్తి లక్ష్మణ్‌ను అనునిత్యం వేధించారు. దీంతో మనస్థాపానికి గురైన ఇద్దరు గడ్డి మందు తాగారు. నరేష్ మృతి చెందగా లక్ష్మణ్ చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు సుధాకర్, రజినిష్‌పై నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుర్చీలు, పరీక్ష ప్యాడ్స్ వితరణ



ప్యాడ్స్‌ను అందజేస్తున్న రోటరీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కోమన్ పల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో పాఠశాలకు కుర్చీలు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులు స్పాన్సర్ ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ ముత్యంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గ్రామానికి పేరు తేవాలన్నారు. ఎలాంటి సందేహం ఉన్న ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకొని పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణతతో గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు మా వంతు సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి , ప్రధాన అధ్యాపకులు కవిత, మాజీ అధ్యక్షులు ప్రవీణ్ పవార్ రోటరీ సభ్యులు వినాయక ఉపాధ్యాయులు వినోద్,ఈటెం గోపాల్, వినోద్, రాజేందర్ గౌడ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు .

బియ్యం దందా ఆగేది ఎప్పుడో?

- జోరుగా రీసైక్లింగ్ దందా
- పాలిషింగ్ చేస్తూ అమ్మకాలు..

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. రేషన్ బియ్యం రైస్‌మిల్లులకు తరలిస్తూ రీసైక్లింగ్‌తోపాటు పాలిషింగ్‌చేసి విక్రయిస్తున్నారు. మరోవైపు టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తూ బియ్యం పట్టుకుంటున్నా దందా మాత్రం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. అధికారులు, పోలీసుల అండదండలతోనే ఈదందా కొనసాగుతోందనే ఆరోపణలు లేకపోలేదు. జిల్లాలోని వేల్పూర్ మండల కేంద్రంలో రెండురోజులక్రితం 120 టన్నుల బియ్యం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసిపి విష్ణుమూర్తి, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో వజ్ర రైస్ మిల్లులో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అక్కడ నిల్వ ఉంచిన రెండు లారీల రేషన్ బియ్యంతో పాటు మరో రెండు పెద్ద లారీల లో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



వేల్పూర్‌లోని రైస్‌మిల్లులో పట్టుకున్న పీడీఎస్ బియ్యం (ఫైల్)

మూడు పువ్వులు ఆరు కాయలుగా...

జిల్లాలో పిడిఎస్ బియ్యంతో రీసైక్లింగ్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా సాగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో బోధన్ డివిజన్ కేంద్రంగా పిడిఎస్ బియ్యం దందా పై సిపి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. గత డిసెంబర్ నెలలో టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఎడపల్లి శివారులోని ఓ రైస్ మిల్ పై దాడులు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి డీసీఎం ద్వారా సేకరించిన పిడిఎస్ రైస్‌ను రైస్ మిల్లులో దంపు చేస్తుండగా పట్టుకున్నారు.

పాలిషింగ్ చేస్తూ అమ్మకాలు..

పిడిఎస్ బియ్యంను కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని పాలిషింగ్ చేసి మార్కెట్లో అమ్ముతున్నారు. బియ్యం కు పాల్ సింగ్ చేసిన తర్వాత వాటిని 25 కిలోల బ్యాగులో నింపి సన్నబియంగా మార్కెట్లో అమ్మకాలు చేస్తారు. దీంతో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు సైతం...

పిడిఎస్ బియ్యాన్ని జిల్లాలోని బోధన్ నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న మహారాష్ట్రకు వ్యాపారులు సరఫరా చేస్తారు. పక్క రాష్ట్రానికి ఇక్కడ నుంచి దూరం తక్కువగా ఉండడం పోలీసులను, అధికారులను మేనేజ్ చేయడంతో ఈ దందా ఇష్టారాజ్యంగా సాగుతుందని ఆరోపణలు సైతం ఉన్నాయి. జిల్లాకు సిపిగా కల్మేశ్వర్ వచ్చిన తర్వాత టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎక్కువసార్లు దాడులు సైతం చేసి పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పేదోడి బియ్యంతో వ్యాపారం చేస్తున్న వారు ఎంతటి వారైనా సరే శిక్షించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం దష్టి సరించాలని ప్రజలు కోరుతున్నారు.ం

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం పిఎఫ్ ఆఫీస్ ముందు తెలంగాణ స్టేట్ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ గణేష్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు మాట్లాడుతూ బీడీ కార్మికులకు సంబంధించిన జాయింట్ డిక్లరేషన్ ఫారాలు గాని, డెత్ జాయింట్ ను గాని ఆధార్



పీఎఫ్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

కార్డు కేవైసీ గాని యధావిధిగా కంపెనీ ఎంప్లాయర్ తో తీసుకొని పరిష్కరించాలని అన్నారు. ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు సంస్థ లో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, కార్మిక శాఖ అధికారులు సిఫారసు చేసిన ప్రకారం 6000 రూపాయల కనీస పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు, ప్రతి నెలలో 26 రోజులు బీడీ కార్మికులకు పని కల్పించాలని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా బీడీ కార్మికులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఇంటి స్థలమున్న కార్మికులకు 10 లక్షల రూపాయలు ఆర్థిక సాయం కింద ఇల్లు నిర్మాణానికి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు బి గోవర్ధన్, ఉప ప్రధాన కార్యదర్శి ఎండి ముకురం, ఉపాధ్యక్షులు ఆదే రంగారెడ్డి, యూనియన్ నాయకులు భానుచందర్, దేవదాస్, దుంపెన మహేష్ కుమార్, శాంత, రాధా, కెవి అనసూయ, కడారి రాములు పాల్గొన్నారు.

పోలీసులకు మాంసం వ్యాపారులు అప్పగింత



పోలీసులకు సమాచారం అందజేస్తున్న యువకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని నడ్పల్లి తండా గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి 44 నాగ్‌పూర్‌గేట్ సమీపంలో అనునిత్యం హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుండి తరలించే మేకలను, గొర్రెలను మేతకు వెళ్లి రాత్రి సమయంలో హైదరాబాద్‌కు తరలించే సమయంలో అనారోగ్యంతో ఉండే మేకలను బడా వ్యాపారస్తులు అక్కడే వదిలి వెళ్ళిపోతుంటారు ఇది గమనించిన మండల కేంద్రంలోని కొందరు వ్యాపారస్తులు మృతి చెంది పడి ఉన్న మేకను గుట్టు చప్పుడు కాకుండా తీసుకుని వెళ్ళి మాంసాన్ని అమ్మకాలు చేపడుతున్నారు. దానిలో భాగంగానే ఆదివారం రాత్రి చనిపోయిన మేకను కోసి విక్రయించేందుకు సిద్ధమైన వ్యాపారుల్ని స్థానికులు పట్టుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. గత కొన్ని రోజులుగా కొందరు యువకులు ఇలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఈ ఘటన వెలుగు చూసింది. రంగంలోకి దిగిన పోలీసులు అ వ్యాపారులను పట్టుకుని అప్పగించారు.

ఎన్నో రోజుల నుండి నడుస్తున్న తంతు..

మేక, గొర్ల మాంసం కిలో ఒక్కొక్క దగ్గర ఒక్కొక్క ధరకు విక్రయించుకుంటున్నారు. 600నుండి మొదలుకొని 800 రూపాయల వరకు కిలో మాంసాన్ని అమ్ముతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మేక, గొర్ల మాంసం ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. వేలరూపాయలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇంతవరకు అంత కరెక్ట్‌గానే ఉన్నా కొందరు వ్యాపారస్తులు మరణించిన మేకలను, గొర్రెల మాంసాన్ని విక్రయిస్తున్నారు. మృతి చెందడమే కాకుండా అనారోగ్యంతో ఉన్న మేకలను కూడా ఇష్టానుసారంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఏ ఒక్కరోజు తనిఖీలు చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం మాడే వారిని ఉపేక్షించవద్దని అలాంటి వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు బోరు బండి కూలి మృతి

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని కారేపల్లి వద్ద బోర్ పాయింట్ వద్ద ప్రమాదవశాత్తు మహేష్ కశ్యప్ (20) అనే కూలి మృతిచెందాడు. ఎస్సై హరిబాబు వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మహేష్ కశ్యప్ బోరు బండి కూలిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న మండలంలోని కారేపల్లి గ్రామంలో బోర్ వేస్తుండగా ప్రమాదవశాత్తు రాడ్ వచ్చి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కూలి మృతదేహం